కుబేరుడి ఆగమనం ఆరోజే..

ధనుష్, నాగార్జున ప్రధాన పాత్రలు పోషిస్తున్న 'కుబేర' సినిమా ఓ విశేషాల సమాహారం. టైటిల్ నుంచే ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్న సినిమా ఇది. యువతరానికి నచ్చే కథలతో సినిమాలు చేసే శేఖర్ కమ్ముల.. తమిళ స్టార్ హీరో ధనుష్‌ని మెయిన్‌లీడ్‌గా తీసుకొని సినిమా చేయడం, దానికితోడు అక్కినేని నాగార్జున కీలక పాత్ర పోషిస్తుండటం, ప్రచార చిత్రాల్లో విభిన్నత, శేఖర్ కమ్ముల సినిమాకు దేవిశ్రీ సంగీతం.. ఇవన్నీ సినిమాపై ఆసక్తి పెరగడానికి కారణాలు. అందుకే 'కుబేర' విడుదల కోసం దేశవ్యాప్తంగా ఉన్న సినీ అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. వారందరి ఎదురు చూపులకు తెరదించుతూ గురువారం మేకర్స్ రిలీజ్ డేట్‌ను ప్రకటించారు. జూన్ 20న ప్రపంచవ్యాప్తంగా 'కుబేర' విడుదల కానుంది. విభిన్నమైన కథాంశంతో నెవర్ బిఫోర్ అనిపించేలా శేఖర్ కమ్ముల ఈ సినిమాను తీర్చిదిద్దుతున్నారని, ధనుష్, నాగార్జున, రష్మిక, జిమ్ సర్భ్ పాత్రలు.. ఆ పాత్రల చుట్టూ తిరిగే కథనం.. ఉద్వేగాలు ఊహలకు అతీతంగా ఉంటాయని మేకర్స్ చెబుతున్నారు. ఈ సందర్భంగా గురువారం రిలీజ్ డేట్ పోస్టర్‌ని విడుదల చేశారు. సినిమాలోని నాలుగు ప్రధాన పాత్రలనూ ఈ పోస్టర్ ద్వారా మేకర్స్ మరోసారి పరిచయం చేశారు. ఎస్వీసీఎల్ఎల్‌పీ పతాకంపై సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్‌మోహన్‌రావు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్న విషయం తెలిసిందే.

సితార సంస్థ ద్వారా 'రెట్రో'

సూర్య కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'రెట్రో'. కార్తిక్ సుబ్బరాజ్ దర్శకుడు. 2డీ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై సూర్య, జ్యోతిక నిర్మించారు. మే 1న పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది. ఈ చిత్ర తెలుగు థియేట్రికల్ హక్కులను ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సొంతం చేసుకుంది. గ్యాంగ్‌స్టర్ రొమాంటిక్ డ్రామాగా దర్శకుడు సుబ్బరాజ్ ఈ చిత్రాన్ని తెరకెక్కించారని, స్టైలిష్ ఎంటర్‌టైనర్‌గా ఆకట్టుకుంటుందని, ప్రచార చిత్రాలకు అద్భుతమైన స్పందన లభిస్తున్నదని చిత్ర బృందం పేర్కొంది. తెలుగు రాష్ట్రాల్లో భారీ స్థాయిలో ఈ చిత్రాన్ని విడుదల చేస్తామని సితార ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ పేర్కొంది. ఈ చిత్రంలో పూజాహెగ్డే, జోజు జార్జ్, జయరామ్, నాజర్, ప్రకాష్‌రాజ్ తదితరులు ప్రధాన తారాగణం. సంతోష్ నారాయణ్ సంగీతాన్నందించారు.

వినూత్నంగా సాగే హారర్ సినిమా

'హారర్, యాక్షన్, కామెడీ, రివేంజ్ అంశాలతో కూడిన మూవీ ఇది. నా పాత్రలో పెద్ద హీరోయిజం ఏమీ ఉండదు. పరిస్థితులకు తగ్గట్టు అన్ని రకాల ఎమోషన్స్ ఉంటాయి. ఓ కొత్త హీరోకి ఇంతకంటే మంచి డెబ్యూ దొరకదు.' అని విరాజ్‌రెడ్డి చీలం అన్నారు. ఆయన కథానాయకుడిగా రూపొందిన చిత్రం 'గార్డ్'. 'రివేంజ్ ఫర్ లవ్' అనేది ఉపశీర్షిక. మిమీ లియా నార్డ్, శిల్పా బాలకృష్ణ కథానాయికలు. జగ పెద్ది దర్శకుడు. అనసూయరెడ్డి నిర్మాత. నేడే ఈ సినిమా విడుదల. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో హీరో విరాజ్ రెడ్డి విలేకరులతో ముచ్చటించారు. 'మాది నిజామాబాద్. ఉన్నతచదువులకోసం ఆస్ట్రేలియా వెళ్లి అక్కడే సెటిల్ అయ్యాను. చిన్నప్పట్నుంచీ సినిమాలంటే ఇష్టం. అక్కడే యాక్టింగ్ స్కూల్‌కి వెళ్లాను. ఈ మూవీ మొత్తం ఆస్ట్రేలియాలోనే తీశాం. ఈ సినిమాకు పనిచేసిన వారంతా కొత్తవాళ్లే. అందుకే ట్రైనింగ్ తీసుకొని చేశాం. సినిమా ఆస్ట్రేలియాలో తీసినా ఇది అసలుసిసలైన తెలుగు కథ. తొలి సినిమా హారర్ జానర్ అయితే తేలిగ్గా ప్రేక్షకులకు చేరువవ్వొచ్చని ఈసినిమా చేశాను. 'అని విరాజ్‌రెడ్డి తెలిపారు. ఇందులో ఫైట్లన్నీ చైనీస్ స్టైల్‌లో ఉంటాయని, షూటింగ్ ఆస్ట్రేలియాలో చేసినా పోస్ట్‌ప్రొడక్షన్ మాత్రం ఇండియాలోనే చేశామని' విరాజ్ తెలిపారు. కొత్తవాళ్లందరం కలిసి చేసిన వినూత్న ప్రయత్నం ఇదని, అందరికీ నచ్చుతుందని నమ్మకంతో ఉన్నామని విరాజ్ రెడ్డి అన్నారు.

'సికందర్' యాక్షన్ హంగామా

గత కొంతకాలంగా భారీ హిట్‌కోసం ఎదురు చూస్తున్నారు అగ్ర హీరో సల్మాన్‌ఖాన్. ఈ నేపథ్యంలో తాజా చిత్రం 'సికందర్' పైనే ఆయన ఆశల్ని పెట్టుకున్నారు. మురుగదాస్ దర్శకత్వంలో సాజిద్ నదియావాలా తెరకెక్కించిన ఈ యాక్షన్ డ్రామా రంజాన్ సందర్భంగా ప్రేక్షకుల ముందుకురానుంది. రష్మిక మందన్న కథానాయికగా నటించింది. గురువారం టీజర్‌ను విడుదల చేశారు. హై ఇంటెన్సిటీ యాక్షన్ ఘట్టాలు, రియల్ స్టంట్స్‌తో టీజర్ గ్రిప్పింగ్‌గా సాగింది. తనదైన యాక్షన్ అవతార్‌లో సల్మాన్‌ఖాన్ మెస్మరైజ్ చేశారు. ఇందులో మరోమారు సల్మాన్‌ఖాన్ పవర్‌ప్యాక్డ్ యాక్షన్‌ను చూస్తారని చిత్రబృందం చెబుతున్నది. కాజల్ అగర్వాల్, సునీల్‌శెట్టి, సత్యరాజ్ తదితరులు చిత్ర తారాగణం.

సినిమావాళ్లు పబ్లిక్ ప్రాపర్టీ కాదు..

ప్రియమణి భావోద్వేగానికి లోనయ్యారు. తమ వైవాహిక జీవితంపై కొందరు స్పందిస్తున్న తీరుపై ఆమె అసహనానికి లోనయ్యారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ 'ఇష్టమైన వ్యక్తిని పెళ్లి చేసుకోవడం కూడా నేరమేనా?.. 2016లో ముస్తఫారాజ్‌తో నాకు నిశ్చితార్థం జరిగింది. ఇక అప్పట్నుంచి మొదలైంది నాపై దాడి. నిజానికి నా పెళ్లంటే నా శ్రేయోభిలాషులంతా ఆనందిస్తారని భావించా. కానీ నేను అనుకున్నది వేరు.. జరుగుతున్నది వేరు. 2017లో నా వివాహం జరిగింది. అక్కడ్నుంచి మాపై ద్వేషం రెట్టింపయ్యింది. ఒక ముస్లింను వివాహం చేసుకోవడమే దీనికి కారణం. కొందరైతే లవ్ జిహాద్ ఆరోపణలు కూడా చేశారు. 'పిల్లలు పుట్టాక ఐసీఎస్‌లో జాయిన్ చేయ్..' అంటూ కామెంట్లు పెట్టారు. ఆవి నన్నెంతో బాధించాయి. సినిమా తారలంటే సోషల్ మీడియా వాళ్లకు పబ్లిక్ ప్రాపర్టీలా ఫీలవుతున్నారు. సరే.. నా భర్త, పిల్లలు ఏంచేశారు? వారిపై ఎందుకు దాడి చేస్తున్నారు. ఈ రోజుక్కూడా నా భర్త, నేనూ కలిసి దిగిన ఫొటోను పోస్ట్ చేస్తే.. పదిలో తొమ్మిది కామెంట్లు మా పెళ్లి గురించే ఉంటాయి.' అంటూ వాపోయింది ప్రియమణి. ప్రస్తుతం తమిళ అగ్రనటుడు విజయ్ నటిస్తున్న సినిమా 'జననాయగన్'లోనూ, బాలీవుడ్ 'ది ఫ్యామిలీ మ్యాన్' వెబ్‌సిరీస్‌లోనూ నటిస్తూ బిజీగా ఉన్నది ప్రియమణి.

అఖండ వేగంతో...

'అఖండ 2'ను ఎట్టిపరిస్థితుల్లో దసరాకి తీసుకొచ్చేయాలనే కసితో వర్క్ చేస్తున్నారు దర్శకుడు బోయపాటి శ్రీను. దానికి తగ్గట్టే జెట్ వేగంతో షూటింగ్ జరుగుతున్నది. మరోవైపు అంతే వేగంగా పోస్ట్ ప్రొడక్షన్‌ని కూడా కానిచ్చేస్తుండటం విశేషం. ప్రస్తుతం బాలకృష్ణ లేని సన్నివేశాలను చిత్రీకరించే పనిలో ఉన్నారు బోయపాటి. మరోవైపు ఏకకాలంలో ఇంటర్వెల్ బ్యాంగ్‌కి సంబంధించిన గ్రాఫిక్ వర్క్ కూడా జరుగుతున్నది. ఇలా షూటింగ్‌తో పాటు నిర్మాణానంతర పనుల్ని కూడా కానిచ్చేస్తుండటం ప్రస్తుతం చర్చనీయాంశమైంది. బోయపాటి బౌండ్ స్క్రిప్ట్‌తో వెళ్లడమే సినిమా ఇంత వేగంగా పూర్తికావడానికి కారణమని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇందులో కూడా బాలయ్య రెండు పాత్రల్లో కనిపిస్తారు. దుష్టసంహారం అనంతరం వారణాసికి వెళ్లిపోయిన అఖండ రుద్ర సికిందర్ అఘోరా.. మళ్లీ తిరిగి ఎందుకొచ్చాడు? ఎవర్ని రక్షించేందుకు తిరిగొచ్చాడు? ఎవర్ని ఎలా శిక్షించాడు? అనేదే సినిమా కథ. 'అఖండ'కు నెక్స్ట్ లెవల్లో సినిమా ఉంటుందని మేకర్స్ చెబుతున్నారు. సంయుక్త మీనన్ కీలక పాత్ర పోషిస్తున్న ఈ చిత్రానికి రామ్ ఆచంట్, గోపీచంద్ ఆచంట నిర్మాతలు. తమన్ స్వరాలందిస్తున్నారు. తేజస్వినీ నందమూరి సమర్పకురాలు.

'కన్నప్ప' గొప్ప ఆధ్యాత్మిక ప్రయాణం

''కన్నప్ప' చిత్రంలో తొలుత ఆఫర్ వచ్చినప్పుడు వద్దనుకున్నా. కానీ శివుడి పాత్రలో నేను బాగుంటానని విష్ణు బాగా నమ్మాడు. ఆయన నమ్మకమే నన్ను సినిమా చేసేలా ముందుకు నడిపించింది. ఈ కథ బలమైన భావోద్వేగాలు, ఆధ్యాత్మిక అంశాలతో విజువల్ వండర్‌గా ఉండబోతున్నది' అన్నారు బాలీవుడ్ అగ్ర నటుడు అక్షయ్ కుమార్. మంచు విష్ణు టైటిల్ రోల్‌ని పోషిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'కన్నప్ప'లో అక్షయ్‌కుమార్ శివుడి పాత్రను పోషిస్తున్న విషయం తెలిసిందే. ఏప్రిల్ 25న ఈ సినిమా విడుదలకానుంది. గురువారం ముంబయిలో టీజర్‌ను అక్షయ్‌కుమార్ ఆవిష్కరించారు. 'కన్నప్ప' తన దృష్టిలో కేవలం సినిమా మాత్రమే కాదని, ఇదొక జీవిత ప్రయాణమని, దీనితో తనకు ఓ అధ్యాత్మిక బంధం ఏర్పడిందని మంచు విష్ణు తెలిపారు. అబ్బురపరిచే విజువల్స్‌తో దైవిక శక్తి కలబోసిన ఈ కథ ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని అందిస్తుందని చిత్ర దర్శకుడు ముఖేష్ కుమార్ సింగ్ పేర్కొన్నారు. 'కన్నప్ప' చిత్రంలో మోహన్‌బాబు, మోహన్‌లాల్, శరత్‌కుమార్, ప్రభాస్, కాజల్ అగర్వాల్ వంటి అగ్ర తారలు భాగమవడంతో ఈ ప్రాజెక్ట్‌పై ప్రేక్షకుల్లో ఆసక్తి పెరిగింది.

వింటేజ్ ఫీల్‌తో నేటి ప్రేమకథ

కథానాయిక అదితిరావు హైదరీ బాలీవుడ్‌లో ఓ ప్రేమకథా చిత్రంలో నటించనుంది. 'ఓ సాథీ రే' పేరుతో తెరకెక్కనున్న ఈ చిత్రానికి ప్రముఖ దర్శకుడు ఇంతియాజ్ అలీ షోరన్నర్‌గా వ్యవహరించనున్నారు. అరీష్ అలీ దర్శకత్వం వహిస్తారు. అర్జున్ రాంపాల్, అవినాష్ తివారి ప్రధాన పాత్రధారులు. బాలీవుడ్‌లో హృద్యమైన ప్రేమకథా చిత్రాలకు చిరునామాగా ఇంతియాజ్ అలీ పేరు తెచ్చుకున్నారు. ఆయన డైరెక్షన్‌లో వచ్చిన రాక్‌స్టార్, జబ్ వీ మెట్, లవ్ ఆజ్ కల్ చిత్రాలు బ్లాక్‌బస్టర్స్‌గా నిలిచాయి. ఈ నేపథ్యంలో తాజా చిత్రం 'ఓ సాథీ రే' ఆసక్తినిరేకెత్తిస్తున్నది. 'గత కాలపు విలువలు, హృదయభావనలతో నడిచే ఆధునిక ప్రేమకథా చిత్రమిది. ఏ మోడరన్ స్టోరీ విత్ వింటేజ్ హార్ట్. మెట్రోపాలిటన్ సిటీలో జరిగే ప్రేమకథగా ఆకట్టుకుంటుంది' అని ఇంతియాజ్ అలీ చెప్పారు. సీట్ ఫిల్మ్స్, రిలయన్స్ ఎంటర్‌టైన్‌మెంట్, నెట్‌ఫ్లిక్స్ సంయుక్త భాగస్వామ్యంలో ఈ సినిమా తెరకెక్కనుంది.

మబ్బులు వీడిన 'ధ్రువ నక్షత్రం'

విక్రమ్ 'ధృవనక్షత్రం' సినిమా ఎట్టకేలకు విడుదలకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. గౌతమ్ మీనన్ దర్శకత్వంలో ఎనిమిదేళ్ల క్రితం మొదలైన ఈ సినిమా న్యాయపరమైన, ఆర్థికపరమైన సమస్యలతోఎన్నో అవాంతరాలను ఎదుర్కొంది. 2023లో షూటింగ్ పూర్తిచేసుకున్నప్పటికీ.. విడుదల విషయంలో జాప్యం జరుగుతూ వచ్చింది. తాజా సమాచారం ప్రకారం మే 1న ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది. త్వరలో మేకర్స్ ద్వారా అధికారిక ప్రకటన రానుంది. గూఢచారి థ్రిల్లర్‌గా రూపొందిన ఈ చిత్రంలో తొలుత సూర్యను కథానాయకుడిగా అనుకున్నారు. అయితే దర్శకుడు గౌతమ్‌మీనన్‌తో సృజనాత్మక విభేదాల కారణంగా ఆయన ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్నారు. చివరకు విక్రమ్ ఈ సినిమాలో జాయిన్ అయ్యారు. గౌతమ్‌మీనన్ స్వీయ దర్శకనిర్మాణంలో తెరకెక్కిన ఈ చిత్రంలో రీతూవర్మ, సిమ్రాన్, పార్థిబన్, రాధిక శరత్‌కుమార్ తదితరులు ముఖ్య పాత్రలను పోషించారు. హారిస్‌జైరాజ్ సంగీతాన్నందించారు.

కరుణాకరన్ దర్శకత్వంలో దిల్‌రాజు సినిమా

తొలిప్రేమ, డార్లింగ్, ఉల్లాసంగా ఉత్సాహం.. ఈ మూడు సినిమాలు చాలు దర్శకుడిగా కరుణాకరన్ పొటెన్షియాలిటీ ఏంటో చెప్పడానికి. అయితే.. సాయిదుర్గతేజ్‌తో చేసిన 'తేజ్ ఐలవ్యూ' తర్వాత ఆయన నుంచి సినిమా లేదు. దాదాపు ఏడేళ్ల విరామం తర్వాత కరుణాకరన్ మెగా ఫోన్ పట్టనున్నారట. దిల్‌రాజు తమ్ముడి కుమారుడైన ఆశీష్ కోసం ఓ కథను సిద్ధం చేశారట కరుణాకరన్. ఆశీష్‌కు కూడా కథ బాగా నచ్చిందట. ఇక దిల్‌రాజుకు నచ్చడమే తరువాయి. త్వరలోనే దిల్‌రాజుకు కథ వినిపిస్తారట కరుణాకరన్. ఆయనకు నచ్చితే ఏప్రిల్ నుంచి షూటింగ్‌ని షురూ చేసే అవకాశం ఉందని ఫిల్మ్ వర్గాలు చెబుతున్నాయి. ప్రేమకథలను తెరకెక్కించడంలో కరుణాకరన్ సిద్ధహస్తుడు. ఈ సినిమా కూడా అదే తరహాలో ఉంటుందట.

కాస్త ఆలస్యంగా 'రాక్షస'

కన్నడ హీరో ప్రజ్వల్ దేవరాజ్ నటించిన తాజా చిత్రం 'రాక్షస'. లోహిత్ హెచ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని కన్నడ, తెలుగు భాషల్లో మార్చి 7న విడుదల చేయబోతున్నారు. నిర్మాత ఎంవీఆర్ కృష్ణ ఈ సినిమా తెలుగు హక్కులను దక్కించుకున్నారు. ఈ నెల 28న విడుదల కావాల్సిన ఈ చిత్రాన్ని అనివార్య కారణాల వల్ల వారం రోజుల పాటు వాయిదా వేశామని మేకర్స్ తెలిపారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలకు అద్భుతమైన స్పందన లభించిందని, తండ్రీకూతుళ్ల అనుబంధం నేపథ్యంలో ఈ సినిమా ఆకట్టుకుంటుందని నిర్మాత ఎంవీఆర్ కృష్ణ పేర్కొన్నారు. అరుణ్‌రాథోడ్, శ్రీధర్, గౌతమ్, సోమశేఖర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి అజనీష్ లోక్‌నాథ్ సంగీతాన్నందించారు.

మా అంచనాలు నిజమయ్యాయి

'నేను ఎంజాయ్ చేసి చేసిన సినిమా ఇది. ఇంటిల్లిపాదీ హాయిగా నవ్వుకోవాలని ఈ సినిమా చేశాం. థియేటర్‌లో అందరితో కలిసి చూశాను. మా లక్ష్యం నెరవేరిందని అర్థమైంది. చివర్లో ఎమోషన్‌కి కూడా బాగా కనెక్టయ్యారు. ఆడియన్స్ నుంచి వస్తున్న స్పందన చెప్పలేనంత ఆనందాన్నిస్తున్నది.' అని హీరో సందీప్‌కిషన్ అన్నారు. ఆయన కథానాయకుడిగా రూపొందిన ఫ్యామిలీ ఎంటర్టైనర్ 'మజాకా' రీతూవర్మ కథానాయిక. రావురమేష్, అన్షూ కీలక పాత్రధారులు. నక్కిన త్రినాథరావు దర్శకత్వంలో రాజేష్ దండా నిర్మించిన ఈ చిత్రం మహాశివరాత్రి కానుకగా బుధవారం విడుదలైంది. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన థ్యాంక్స్‌మీట్‌లో సందీప్ కిషన్ మాట్లాడారు. 'నవ్వొచ్చినప్పుడు నవ్వాలి. ఏడుపొచ్చినప్పుడు ఏడవాలి. అప్పుడే హెల్త్ బావుంటుంది. ఈ రెండూ ఈ సినిమాలో ఉన్నాయి. ఆ విషయంలో మేం సక్సెస్ అయ్యాం. తప్పకుండా థియేటర్లోనే చూడాల్సిన ఫ్యామిలీ ఎంటర్టైనర్ ఇది.' అని దర్శకుడు త్రినాథరావు నక్కిన చెప్పారు. తాను రాసిన ప్రతి పదానికీ గౌరవం తెచ్చేంత గొప్పగా త్రినాథరావు నక్కిన ఈ సినిమా తీశారని రైటర్ ప్రసన్న అన్నారు. ఈ సినిమా విషయంలో తమ అంచనాలన్నీ నిజమయ్యాయని నిర్మాత రాజేష్ దండా తెలిపారు. ఇంకా కథానాయికలు రీతూవర్మ, అన్షు, నిర్మాత అనిల్ సుంకరలతోపాటు అతిథులుగా విచ్చేసిన దర్శకులు రామ్ అబ్బరాజు, ఐవి ఆనంద్ కూడా మాట్లాడారు.

సైకలాజికల్ థ్రిల్లర్ 'ది ఐ'

'ది ఐ' చిత్రం ద్వారా గ్లోబల్ ఆడియెన్స్‌ను పలకరించబోతున్నది అగ్ర కథానాయిక శృతిహాసన్. సైకలాజికల్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ చిత్రానికి డాఫ్నేష్మోన్ దర్శకత్వం వహించారు. ఈ నెల 27నుంచి మార్చి 2 వరకు ముంబయిలో జరుగనున్న వెంచ్ ఫిల్మ్‌ఫెస్టివల్‌లో ఈ సినిమా భారత్ తరపున ప్రీమియర్ కానుంది. చనిపోయిన తన భర్తను తిరిగి బతికించుకోవడానికి ఓ మహిళ చేసే ప్రయత్నాల నేపథ్యంలో ఈ సినిమాను తెరకెక్కించారు. శృతిహాసన్ మాట్లాడుతూ 'సైకాలజీ, అతీంద్రియ శక్తుల నేపథ్యంలో తీసే సినిమాలంటే నాకు చాలా ఇష్టం. మహిళలందరూ కలిసి ఈ సినిమాను రూపొందించడం విశేషంగా భావిస్తున్నా. సినీరంగంలో మహిళాసాధికారత ఉండాలనే నా ఆలోచనలకు అనుగుణంగా ఈ సినిమా తయారైంది.' అని చెప్పింది. ఈ సినిమా ద్వారా శృతిహాసన్ ప్రతిభాపాటవాలు అంతర్జాతీయ స్థాయికి చేరుతాయనే నమ్మకం ఉందని మేకర్స్ తెలిపారు.